

సీఎం కప్ పోటీలకు పేర్లు నమోదు చేసుకోవాలి

కందుకూరు డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు గ్రామ పంచాయతీల్లో పేర్లను నమోదు చేసుకోవాలని ఎంపీవో గీత కోరారు. ఈనెల 7, 8వ తేదీల్లో గ్రామస్థాయిలో.. 10, 12వ తేదీల్లో మండలస్థాయిల్లో అథ్లెటిక్స్, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, యోగా క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఆ సక్తి గల క్రీడాకారులు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టరు, గ్రామ పంచాయతీలలో పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ కంచెల ఏర్పాటులో నిర్లక్ష్యం
- ప్రమాదాలు చోటుచేసుకొని పశువులు మృత్యువాత
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



8

అంబేద్కర్ మార్గం అనుసరణీయం

- ఘనంగా భారత రాజ్యాంగ నిర్మాత వర్ధంతి
- విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళి అర్పించిన నాయకులు



8

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- మహిళా స్వయం సహాయక సంఘాల బలోపేతానికి కృషి
- చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



7

భూ నిర్వాసితులకు అండగా ఉంటాం

- ఫోర్త్‌సిటీ రోడ్డు నిర్మాణానికి ఇష్టానుసారంగా సర్వే
- పరిహారం విషయం తేల్చాలని డిమాండ్
- అగర్‌మియాగూడలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినతి పత్రం ఇస్తున్న రైతులు

కందుకూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కందుకూరులో ఏర్పాటు చేస్తున్న ఫోర్త్‌సిటీ రోడ్డుకు భూములు కోల్పోతున్న రైతులు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అగర్‌మియాగూడ గ్రామానికి వచ్చిన ఆయనకు రైతులు వినతి పత్రం అందించారు. ఫోర్త్ సిటీ రోడ్డుకు మా భూములు ఇవ్వమని, న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. భూసేకరణ చట్టానికి విరుద్ధంగా అధికారులు సర్వే చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే చేసేముందు రైతులతో పరిహారం విషయం ఎందుకు చర్చించడం లేదని ఆయన ప్రశ్నించారు. బలవంతంగా భూములు లాక్కోవాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు.ఈ భూసేకరణలో సన్న, చిన్నకారు రైతులే అధికంగా నష్టపోతున్నారని తెలిపారు. పరిహారం ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాతీయ కిసాన్‌మోర్చా నాయకులు బస్వ పాపయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహ్మారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మంద జ్యోతి, నాయకులు పున్న భిక్షపతి, ప్రభాకర్, పాండు, జగదీశ్వర్‌రెడ్డి, రైతు సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

జిల్లాలో నేడు

షాబాద్‌లో గ్రంథాలయ భవన ప్రారంభోత్సవం

షాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) షాబాద్ మండల కేంద్రంలో శనివారం నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించనున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల వివక్షతోనే గ్రంథాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని, వాటి స్థానంలో నూతన భవనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. షాబాద్ మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరుకున్న భవనాన్ని అన్ని హంగులతో నిర్మించి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరవుతారని తెలిపారు.



యాసంగి కష్టమే?

ఉమ్మడి జిల్లాలో యాసంగి సాగు ప్రశ్నార్థకంగా మారింది. లోటు వర్షపాతం, అడుగంటు తున్న భూగర్భ జలాలు ఈ సారి పంటల సాగు విస్తీర్ణంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. గతేడాది ఈపాటికే వరి నాట్లు, ఆరుతడి పంటలు ముమ్మరంగా సాగయ్యాయి. కానీ ఈ ఏడాది యాసంగి సీజన్‌లో కురవాల్సిన వర్షాలు ముఖం చాటేయడంతో రైతన్నకు కష్టాలు తప్పేలా లేవు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగు కష్టమేనని దిక్కులు చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో తగ్గిన సాగు విస్తీర్ణం


- రంగారెడ్డి జిల్లాలో 5 శాతంలోపే పంటలు
- వికారాబాద్‌లో 18.25 శాతం
- ఈ సీజన్‌లో 50 శాతం లోటు వర్షపాతం
- శరవేగంగా పడిపోతున్న భూగర్భజలాలు
- ఆందోళనలో రైతాంగం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి) : వానాకాలం విస్తారంగా వర్షాలు కురిసి పంటలు సాగు పెరిగినప్పటికీ యాసంగిలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. గడిచిన నెల రోజులుగా కనీస స్థాయిలో కూడా వర్షాలు పడకపోవడంతో యాసంగి సాగుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. సాధారణంగా అక్టోబర్ మొదటి వారం నుంచి యాసంగి సీజన్ ప్రారంభమవుతుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో యాసంగిలో ఆయా పంటల సాగు ఆశించిన స్థాయిలో ముందుకు వెళ్లడం లేదు. మోస్తరు వర్షాలు కూడా లేకపోవడంతో భూమిలో తడిలేక ఆరుతడి పంటలు ఆలస్యమవుతున్నాయి. మరోవైపు వానాకాలం సీజన్‌లో వేసిన వరి పంట కోతలు కూడా ఆలస్యమవుతున్నాయి. గడిచిన రెండు వారాలుగా తుపాన్ కారణంగా మబ్బులు కమ్ముకోవడంతో

- మిగతా 6వ పేజీలో..

ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

జిల్లా	సగటు సాగు	గత ఏడాది (ఈ సమయానికి)	ప్రస్తుత సాగు	సాగుశాతం
రంగారెడ్డి	1,02,063	67,866	4546	4.45
వికారాబాద్	1,11,072	17054	20,321	18.25
మేడ్చల్	13,849	9,210	56	0.40



యాచారంలో మాచర్ల బస్సులు ఆపండి

యాచారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : యాచారం మండల కేంద్రంలో మాచర్ల డిపో బస్సులు ఆపాలని కోరుతూ మండల కేంద్రానికి పలువురు ప్రయాణికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మాచర్ల డిపో అధికారులకు లేఖ రాశారు. మండల కేంద్రంలో బస్టాండ్ ఉన్నా బస్సులు ఆపకపోవడంతో తీవ్ర ఇబ్బంది పాలవుతున్నామని ఆ లేఖలో పేర్కొన్నారు. బస్సులు ఆపాలని కోరితే బస్టాప్ లేదని డ్రైవర్ చెబుతున్నారని వివరించారు. యాచారంలో మాచర్ల డిపో బస్సులు ఆపకపోతే ధర్నా చేస్తామని వారు చెప్పారు. అలాగే దేవరకొండ డిపోకు చెందిన బస్సులు కూడా ఆపడం లేదని తెలిపారు. టిమ్ మిషిన్‌తో బస్సు నడుపుతున్న డ్రైవర్ యాచారంలో స్టాప్ లేదని ప్రయాణికులను దింపేస్తున్నారని తెలిపారు.

ఎన్నిక

ఎమ్మార్పీఎస్ మండల నూతన కమిటీ

ఆమనగల్లు , డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తలకొండపల్లి మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం సమావేశమై సంఘం జిల్లా అధికార ప్రతినిధి కృష్ణమాదిగ ఆధ్వర్యంలో కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షునిగా తుడుం శ్రీను మాదిగ, ఉపాధ్యక్షులుగా సంజీవ, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల జంగయ్య కార్యదర్శిగా ఏదుల శరత్ చంద్రమాదిగ, కోశాధికారిగా గణేశ్ మాదిగ, అధికార ప్రతినిధిగా కొప్పు యాదయ్య మాదిగ, సలహాదారులుగా తూర్పు శ్రీనుమాదిగ, కార్యవర్గ సభ్యులుగా చంద్రయ్య ఎన్నికయ్యారు. నూతన కమిటీని ఎన్నిక పత్రాన్ని అందజేసి సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జ్యోతయ్య మాజీ ఎంపీటీసీ రమేశ్, నాయకులు యాదయ్య, విజయ్, రాజు, మహేశ్, నర్సింహ్మ, యాదయ్య, సంపత్ కుమార్, విజయ్, శ్రీకాంత్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధికారి ప్రతినిధి కుమార్, తదితరులు ఉన్నారు.

పొలంలోనే నేలరాలుతున్న పత్తి



తెల్లబోయిన పత్తి రైతు

మద్దతు ధర తగ్గించిన సీసీఐ

- ఓ వైపు దిగుబడి దిగులు.. మరోవైపు పత్తి తీతకు కూలీల కొరత
- పొలంలోనే రాలుతున్న పంట
- దిక్కుతోచని స్థితిలో పత్తి రైతులు

చౌదరిగూడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పత్తి రైతును కష్టాలు చుట్టుముట్టాయి. అన్ని అవస్థలకు ఓర్చి సాగు చేసిన పత్తిని తీసేందుకు కూలీల కొరత కుదిపేస్తుంది. స్థానికంగా కూలీలు దొరకక ఇతర రాష్ట్రాల నుంచి తీసుకురావాల్సిన పరిస్థితి నెలకొంది. ఆ కూలీలకు కిలో పత్తికి రూ.14 చెల్లించి పత్తి పంట ఇంటికొచ్చిందని సంతోషపడే లోపే సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) మద్దతు ధర రూ.50 తగ్గించి రైతులకు షాక్ ఇచ్చింది. కొందుర్గు మండలంలో 9260 ఎకరాలు, జిల్లేడ్ చౌదరిగూడ మండలం 4,500 వందల ఎకరాల్లో రైతులు పత్తిపంటను సాగుచేశారు. అయితే కూలీలు కొరతతో చెట్ల మీద ఉన్న పత్తి పొలంలోనే రాలిపోతుంది. డిమాండ్ కారణంగా కూలి రేటు కూడా పెంచేశారు. మొదట కిలో పత్తి ఏరితే రూ.10 చెల్లించే వారు. ప్రస్తుతం 12 రూపాయలు ఇస్తామన్నా ఎవరూ ముందుకు రావడంలేదు. చుట్టుపక్క గ్రామాల నుంచి కూలీలను ఆటోలో తీసుకురావాల్సి వస్తుంది. ఆటో కిరాయి

మిగతా 8వ పేజీలో...

అజీజ్‌నగర్‌లో సిక్కిం సర్పంచ్‌ల బృందం

గ్రామంలో అభివృద్ధి పనుల పరిశీలన

మొయినాబాద్ రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామపంచాయతీని సిక్కిం రాష్ట్ర సర్పంచ్‌ల బృందం సందర్శించింది. శుక్రవారం దాదాపు 70 మంది పంచాయతీ కార్యాలయానికి వచ్చి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఆరా తీశారు. అంతకుముంది మండల అభివృద్ధి అధికారి సంధ్య వారికి స్వాగతం పలికారు. గ్రామాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



పంచాయతీ కార్యాలయం వద్ద సిక్కిం రాష్ట్ర సర్పంచ్‌ల బృందం

నోవాటెల్‌కు బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్ అవార్డు



హోటల్‌లో సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను చూపిస్తున్న చెఫ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని నోవాటెల్ హోటల్‌కు బెస్ట్ ఎకో ఫ్రెండ్లీ హోటల్ అవార్డు -2024 వచ్చినట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆహ్లాదకర వాతావరణంలో నిర్వహిస్తున్న నోవాటెల్ హోటల్‌లో కస్టమర్లకు రుచికరమైన వంటకాలతో పాటు కార్లకు ఈవీ చార్జింగ్ సదుపాయం, 2వేల ఎల్ఈడీ లైట్లు, దాదాపు 500 వాటర్ కుళాయిలు అందుబాటులో ఉన్నాయి. వర్షపు నీటిని ఒడిసి పట్టి రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్స్ ద్వారా నెలకు 10 వేల లీటర్ల నీటిని పొదుపు చేస్తున్నామని చెప్పారు. 30 వేల లీటర్ల నీటిని వివిధ పనుల కోసం వినియోగిస్తున్నామని వివరించారు. 250 మందికి తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. 2 వేల చదరపు అడుగుల హెర్బల్ గార్డెన్‌కు రీసైక్లింగ్ చేసే వాటర్‌ను వినియోగిస్తామని చెప్పారు. హోటల్‌లో పండించే కూరగాయలు సేంద్రియ ఎరువులనే వాడుతున్నామని చెప్పారు. కస్టమర్లకు ఉత్తమ సేవలు అందించడమే ఎయిర్‌పోర్టు నోవాటెల్ హోటల్ లక్ష్యమని వారు పేర్కొన్నారు.

సమానత్వంగా జీవించాలన్నదే

భగవద్గీత ఉద్దేశం

ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య



విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య

నందిగామ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గీత అనేది జీవన విధానమని, అందరినీ సమానత్వంగా చూడాలన్నదే భగవద్గీత ఉద్దేశమని ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య అన్నారు. నందిగామ మండల పరిధిలోని కన్హాశాంతివనంలోని ప్రపంచంలోని అతి పెద్ద ధ్యాన కేంద్రంలో శుక్రవారం గీతోపదేశ్ సమ్మిట్‌ను రామచంద్రమిషన్ గురూజీ పద్మభూషణ్ అవార్డు గ్రహీత కమలేష్ డి పటేల్‌తో కలసి ఉత్తర్‌ప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి దేశంలోని వివిధ రాష్ట్రాల 20 విద్యాసంస్థల నుంచి 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ కొత్త తరానికి భగవద్గీతపై అవగాహన కల్పించాలన్నారు. దీనివల్ల ఆధ్యాత్మికంగా, భౌతికంగా, ఉన్నతంగా జీవించడానికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భగవద్గీత అనేది మతపరమైన సిద్ధాంతం కాదన్నారు. సమతత్వమే యోగం అనే థీమ్‌తో గీతోపదేశ్ సమ్మిట్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అంతకుముందు కేశవ్ ప్రసాద్ మౌర్య శాంతివనంలో మొక్కను నాటారు. కార్యక్రమంలో రామచంద్రమిషన్ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎయిర్‌గన్‌తో కాల్పులు



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎయిర్ గన్

షాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపి బెదిరింపులకు పాల్పడ్డ సంఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ముద్దెంగూడకు చెందిన ఖానాపురం లక్ష్మీనారాయణ తన పొలం పక్కన రియాజ్ సనాయ్ పొలంలో గొర్రెలు, మేకలు మేపుతున్నాడు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన తాళ్లగూడెం చంద్రయ్య రియాజ్ సనాయ్‌కు ఈ విషయం ఫోన్‌చేసి చెప్పాడు. దీంతో రియాజ్ అక్కడికి చేరుకొని ఆగ్రహంతో తన వద్ద ఉన్న ఎయిర్‌గన్‌తో లక్ష్మీనారాయణను బెదిరిస్తూ రెండు రౌండ్‌ల కాల్పులు జరిపాడు. మరోసారి మేకలను తన పొలంలో మేపితే ఊరుకోననని బెదిరించాడు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు గ్రామానికి చేరుకొని రియాజ్ నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలి



మహాసభలో మాట్లాడుతున్న సామ్యేల్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేపట్టేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.సామ్యేల్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరి స్మారక కేంద్రంలో జరిగిన సీపీఎం మున్సిపల్ మూడో మహాసభల్లో అయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేకపోతుందన్నారు. రైతు భరోసా లేదని, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయకపోవడంతో రైతులు ఎదురుచూస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలకు రూ.2500 ఆర్థికసాయం లేదని, ఆసరా పింఛన్లు పెంచి ఇవ్వడం లేదంటూ విమర్శలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మున్సిపాలిటీ కార్యదర్శిగా ఎల్లేష్



సీపీఎం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ కార్యదర్శిగా మరోమారు ఎల్లేష్‌ను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వీరేషం, బి.యాదగిరి, పురుషోత్తం, ముసలయ్య, శంకర్, స్వప్న, షఫీ యున్నీసా, భిక్షపతిలను ఎన్నుకున్నారు.

శ్రీలక్ష్మీ నారసింహ భక్తి గజళ్లు పుస్తకావిష్కరణ



పెద్దేముల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి ద్యావరి నరేందర్‌రెడ్డి రచించిన శ్రీ లక్ష్మీ నారసింహ భక్తి గజళ్ల పుస్తకాన్ని శుక్రవారం ప్రముఖ సినీ దర్శకుడు వేణు ఉడుగుల నగరంలోని ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ద్యావరి నరేందర్‌రెడ్డి తెలుగు గజళ్ల రచనలో 20 ఏళ్లుగా విశేష కృషి చేస్తూ భక్తి, అభ్యుదయ, సామాజిక ప్రణయభావాలతో కూడిన గజళ్లు రాయడం అభినందనీయమన్నారు. సినీ నిర్మాత నాగేశ్వర్ రావు, ప్రముఖ గజల్స్ గాయని డాక్టర్ స్వరూపారెడ్డి, గాయకుడు దివాకర్, వికారాబాద్ జిల్లా లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు టి.మహేందర్, బీజేపీ యువ నాయకులు పి.రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతరం నరేందర్‌రెడ్డిని వారు సన్మానించారు.

యాసంగి కష్టమే?

(5వ పేజీ తరువాయి)

వరి కోతలపై ప్రభావం పడింది. సాధారణంగా వరి సాగు చేసే చోట రెండో పంట వేస్తుంటారు. కోతలు ఇంకా పూర్తికాకపోవడంతో యాసంగి సాగు విస్తీర్ణం కూడా ఇంకా పెరగలేదు. కనీస స్థాయిలో కూడా ఈ ఏడాది పంటలు సాగు జరగలేదు. రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు యాసంగిలో 4.5శాతమే పంటలు సాగు కావడం గమనార్హం. అయితే వికారాబాద్‌లో మాత్రం పరిస్థితులు కొంత ఆశాజనకంగా ఉన్నాయి. ఇక్కడ 18.25శాతం పంటల సాగు జరిగింది. మేడ్చల్‌లో కనీసం ఒక్కశాతం కూడా పంటలు వేయలేదు.

51శాతం లోటు వర్షపాతం

మూడు జిల్లాల్లో యాసంగి సీజన్‌లో కనీస స్థాయిలో కూడా వర్షాలు లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యాసంగిలో రంగారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు సగటు 123.5మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 62మి.మీ వర్షపాతమే కురిసింది. అంటే దాదాపు 51శాతం లోటు వర్షపాతం నమోదైంది. అలాగే మేడ్చల్ జిల్లాలో 42శాతం, వికారాబాద్ 16శాతం తక్కువ వర్షం కురిసింది. యాసంగిలో పంటల సాగుకు కీలకమైన నవంబరు, డిసెంబరు నెలల్లో వర్షాలు పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

సాగు తక్కువే..

ఉమ్మడి జిలాలోని పలు ప్రాంతాల్లో భూగర్భజలాలు భారీగా తగ్గిపోవడం యాసంగి పంటల సాగుపై ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాదితో పోలిస్తే నవంబరు నెలాఖరు నాటికి భూగర్భజలాలు 1.55 మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇదిలా ఉంటే వికారాబాద్ జిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 1,11,072 ఎకరాల్లో పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా... ఇప్పటి వరకు 20,321 ఎకరాల్లో పంటలు వేశారు. అలాగే రంగారెడ్డిజిల్లాలో ఈ ఏడాది యాసంగిలో 1,02,063 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటి వరకు కేవలం 4,546 ఎకరాలు మాత్రమే రైతులు పంటలు వేశారు. అంటే కనీసం అయిదు శాతం కూడా పంటలు సాగు చేయలేదు. గత ఏడాది ఇదే సమయానికి 67,866 ఎకరాల్లో పంటలు వేయడం గమనార్హం. మేడ్చల్ జిల్లాలో సీజన్‌లో కనీసం ఒక్కశాతం కూడా పంటలు సాగు చేయలేదు. అయితే యాసంగి సీజన్‌లో కొన్ని పంటలు వేసేందుకు ఇంకా గడువు ఉండడంతో వర్షాల కోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. బోర్లు ఉన్న రైతులు రెండో పంటగా కూడా వరి వేసేందుకే మొగ్గు చూపుతున్నారు.

శరవేగంగా పడిపోతున్న భూగర్భజలాలు

ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలో సాగునీటి కష్టాలు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది. గడిచిన నెల రోజుల్లో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గిపోవడమే ఇందుకు కారణం. వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటడంతో యాసంగి పంటలపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత అక్టోబర్ నెలాఖరుతో పోలిస్తే నవంబరు నెలాఖరు నాటికి భూగర్భజలాలు గణనీయంగా తగ్గిపోవడమే ఇందుకు కారణం. రంగారెడ్డిజిల్లాలో గత అక్టోబర్ నెలాఖరు నాటికి 7.71 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా నవంబరు నెలాఖరు నాటికి 9.36 మీటర్ల లోతుకు పడిపోయాయి. అంటే ఒక నెలలో 1.55 మీటర్ల కిందకు నీటి నిల్వలు పడిపోయాయి. అలాగే వికారాబాద్‌లో అక్టోబరు నెలాఖరుతో నవంబరు నెలాఖరు పోలిస్తే 0.21 మీటర్లు నీటినిల్వలు తగ్గాయి. అలాగే మేడ్చల్ జిల్లాలో ఒక నెలలో 2.60 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోయాయి. వాస్తవానికి ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వానాకాలం సగటుకు మించి వర్షపాతం నమోదైంది. రంగారెడ్డిజిల్లాలో వానాకాలం 32శాతం అధిక వర్షపాతం నమోదైంది. అలాగే వికారాబాద్ జిల్లాలో 41శాతం, మేడ్చల్ జిల్లాలో 21శాతం అధిక వర్షపాతం నమోదైంది. దీంతో ఉమ్మడి జిల్లాలో భూగర్భజలాలు గణనీయంగానే పెరిగాయి. అయితే యాసంగి ఆరంభం తరువాత వర్షాలు పడలేదు. ఉమ్మడి జిల్లాలో యాసంగిలో దాదాపు 50శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. దీంతో భూగర్భజలాలు శరవేగంగా పడిపోతున్నాయి. అనేక మండలాల్లో ఇప్పటి వరకు సెంటీమీటర్ వర్షపాతం కూడా నమోదు కాలేదు. మరో వైపు విచ్చలవిడిగా నీటి వాడకం పెరగడంతో శరవేగంగా భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. దీని ప్రభావం యాసంగి పంటలపై కూడా పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో యాసంగిలో వర్షపాతం (మి.మీ)

జిల్లా	సాధారణం	ఇప్పటి వరకు	తగ్గుదల (శాతంలో)
రంగారెడ్డి	125.3	62.0	51
మేడ్చల్	126.6	72.8	42
వికారాబాద్	102.7	86.6	16

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు చేయాలి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

కొడంగల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటుతో పాటు నిధులు విడుదల చేయాలని బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందించారు. శుక్రవారం కొడంగల్‌లో పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రిని వారు కలిసి వినతిపత్రం అందించారు. బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు రూ.50 కోట్లు విడుదల చేయాలని, పేద బ్రాహ్మణులకు స్వయం ఉపాధి, పిల్లల చదువు కొరకు నిధులు విడుదల చేయాలని కోరారు.

విద్యార్థుల వినూత్న ప్రయోగాలు.. మంత్రి ప్రశంస

కొడంగల్ పట్టణంలోని జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు వోకేషనల్ ఎడ్యుకేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ హార్డ్‌వేర్ కోర్సులో భాగంగా తక్కువ ఖర్చుతో ఎల్‌ఈడీ బల్బులను తయారు చేశారు. శుక్రవారం స్థానిక మార్కెట్ యార్డులో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబుకు విద్యార్థులు తయారు చేసిన ఎల్‌ఈడీ బల్బులను అందించగా.. వారి నైపుణ్యాన్ని చూసి మంత్రి ప్రశంసించారు.

ఏడాదిలో ఏకంగా 4 ఉద్యోగాలు

● టీజీటీ, పీజీటీ, జేఎల్ జాబ్‌లతో సత్తా చాటిన సౌమ్యారెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిలుకూరు గ్రామానికి చెందిన గడ్డం సౌమ్యారెడ్డి ఏడాది కాలంలోనే ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి సత్తా చాటింది. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం నాదర్‌గుల్ గ్రామానికి చెందిన గడ్డం సౌమ్యారెడ్డికి మొయినాబాద్ మండలం చిలుకూరుకు చెందిన శ్రీధర్‌రెడ్డితో 2014లో వివాహమైంది. ఆ తరువాత కూడా ఆమె చదువు కొనసాగించింది. భర్త ప్రోత్సాహంతో డిగ్రీ పూర్తిచేసిన తరువాత బీఎడ్, ఎంఎస్సీ చదివింది. 2022లో టీజీటీ, పీజీటీ, గురుకులాల జేఎల్‌కు నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసింది. 2023లో పరీక్ష రాసి ఉత్తమ ప్రతిభ చూపి ఒకేసారి మూడు ఉద్యోగాలకు అర్హత సాధించింది. తాజాగా టీజీపీఎస్సీ నిర్వహించిన పరీక్షలోనూ ఉత్తీర్ణత సాధించి జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యింది. ప్రస్తుతం గురుకుల జూనియర్ కళాశాలలో చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ ఉద్యోగంలో చేరాలని నిర్ణయించుకున్నట్లు సౌమ్యారెడ్డి 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు.



సౌమ్యారెడ్డి, చిలుకూరు గ్రామం మొయినాబాద్ మండలం

పార్ట్‌టైం జాబ్‌లు చేస్తూ..

మర్పల్లి: మండలంలోని కల్కోడ గ్రామానికి చెందిన సుశీల, రత్నయ్యలకు ఇద్దరు కూతుర్లు, కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు మొగులయ్య గ్రామంలో టెన్త్ వరకు చదివి వికారాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్‌లో అడ్మిషన్ తీసుకున్నాడు. అయితే, వారిది పేద కుటుంబ కావడంతో కాలేజీ ముగిశాక వివిధ ప్రైవేట్ కార్యాలయాల్లో పార్ట్‌టైం జాబ్‌లు చేసేవాడు. ఈక్రమంలో 2017లో డీఎస్సీ రాసి ఎస్జీటీ ఉద్యోగం సాధించాడు.మండలంలోని గుర్రంగట్టు తండా పాఠశాలలో పోస్టింగ్ తీసుకున్నాడు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే ఇటీవల జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అదేవిధంగా మొగులయ్య సోదరి నాగలక్ష్మి కూడా అన్న సోదరుడి ప్రోత్సాహంతో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం సాధించింది.

డిజిటల్ మార్కెటింగ్‌పై మహిళలకు శిక్షణ



మాట్లాడుతున్న లీడ్ ఇండియా జిల్లా మేనేజర్ శివప్రసాద్

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అభయ అసోసియేషన్ ఫర్ ఎంపవర్మెంట్ ఆఫ్ ఉమెన్, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో డిజైనర్ బ్లౌసెస్, డిజిటల్ మార్కెటింగ్‌పై నెల రోజుల పాటు ఉచిత శిక్షణను శుక్రవారం ప్రారంభించారు. 30 మంది మహిళలకు నెల రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న లీడ్ ఇండియా జిల్లా మేనేజర్ శివప్రసాద్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక చేయూతకు ప్రభుత్వ పథకాలను, బ్యాంకు రుణాలపై వివరించారు. మహిళా సాధికారతకు కృషిచేస్తున్న అభయ అసోసియేషన్ ఎన్జీవోను అభినందించారు. అభయ అధ్యక్షురాలు ఉష, సభ్యులు భాను, షకీలా, అనిత, కోమలారెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి



రాజశేఖరంనకు జ్ఞాపిక అందిస్తున్న అనురాగ్ వర్సిటీ ప్రతినిధులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు హ్యాకథాన్ కార్యక్రమాల ద్వారా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డీఆర్‌డీవో శాస్త్రవేత్త రాజశేఖరం తెలిపారు. పోచారం మున్సిపాలిటీ, వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో శుక్రవారం ఐటీ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాక్ అటాక్ హ్యాకథాన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువ ఇంజనీర్లు దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ హ్యాకథాన్‌లో వివిధ కళాశాలల నుంచి 710 మంది విద్యార్థులు నమోదుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీన్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ విజయ్‌కుమార్, డీన్లు సుధీర్‌రెడ్డి, మహీపతి శ్రీనివాస్‌రావు, వెంకట్‌రెడ్డి, నతీషశర్మ, శేఖర్‌రెడ్డి, అధ్యాపకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీపై వెయ్యి స్ప్రింక్లర్లు మంజూరు

ఏఎంసీ చైర్‌పర్సన్ గీతా నర్సింహ



విలేకరులతో మాట్లాడుతున్న గీతా నర్సింహ

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలోని ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు సబ్సిడీపై వెయ్యి స్ప్రింక్లర్లు మంజూరయ్యాయని ఆమనగల్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ తెలిపారు. రైతులకు 75శాతం రాయితీ రైతులకు స్ప్రింక్లర్లు అందజేస్తున్నట్లు చెప్పారు. ఆమనగల్లు మార్కెట్ యార్డ్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో గీత మాట్లాడుతూ రైతులు ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం రూ.23,385 విలువైన స్ప్రింక్లర్లును 75 శాతం రాయితీపై అందిస్తున్నట్లు తెలిపారు. రైతులు డీడీ తీసి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. సందేహాలకు ఉద్యానవన శాఖ అధికారులను సంప్రదించాలని అన్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చొరవతో ఆమనగల్లు వ్యవసాయ సబ్ డివిజన్‌కు అధిక మొత్తంలో స్ప్రింక్లర్లు మంజూరైనట్లు తెలిపారు. ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర కల్పిస్తోందని, రైతులు తొందరపడి దళారులను ఆశ్రయించి మోసపోవద్దని సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, ప్రభాకర్‌రెడ్డి, జగన్, ఏఎంసీ డైరెక్టర్లు శ్రీశైలం, నరేశ్‌నాయక్, అజీం, అంజయ్య, పాండురంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆత్మహత్యలపై విచారణ జరపాలి



ఘట్‌కేసర్‌లో కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఘట్‌కేసర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలలో విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చూస్తూ శుక్రవారం ఘట్‌కేసర్ ఏఐఎస్ఎఫ్ విద్యార్థులు నిరసన ర్యాలీ నిర్వహించారు. కార్పొరేట్ విద్యాసంస్థల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో పలు విద్యాసంస్థలు ర్యాంకుల కోసం విద్యార్థులను మానసికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, అజయ్, వెంకట్, మహేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

నాగమణి హత్యను నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ



ఇబ్రహీంపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి రాయపోల్ గ్రామంలో ఇటీవల జరిగిన పోలీస్ కానిస్టేబుల్ కొంగర నాగమణి హత్యను నిరసిస్తూ శుక్రవారం రాత్రి పౌరహక్కుల సంఘం, కుల వివక్ష పోరాట కమిటీల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కులోన్మాదం పెచ్చు మీరిపోతుందని.. దీనిని ప్రతీ ఒక్కరు తీవ్రంగా ఖండించాలంటూ నినాదాలు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు.

కనుల పండువగా గుంటం పీర్ల జాతర



గుంటం పీర్లను దర్శించుకుంటున్న స్వరూప, వీరేందర్‌నాగార్జున

తాండూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కోటబాస్పల్లి గ్రామ శివారులోని గుంటం పీర్ల జాతరోత్సవాలను రెండు రోజులుగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి ప్రారంభమైన జాతరోత్సవాలను మాజీ సర్పంచ్ కుర్వ నాగార్జున ఆధ్వర్యంలో తాండూరు మండల మాజీ వైస్ఎంపీపీ స్వరూపా వెంకట్‌రెడ్డిలు పీర్లకు గంధం నిర్వహించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కోటబాస్పల్లి గ్రామానికి చెందిన మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి సోదరుడు, ఇంద్రారెడ్డి చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ నర్సింహారెడ్డి దర్శించుకున్నారు. ఆయన వెంట జినుగుర్తి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగప్ప ఉన్నారు. మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వీరేందర్ రెడ్డి, ఎల్మకన్నె పీఏసీఎస్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి లాలప్ప, మొగులప్ప, వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే



శంకర్‌పల్లిలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

శంకర్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. శంకర్‌పల్లిలో శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మీ ప్రవీణ్‌కుమార్‌తో కలిసి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.21.40 కోట్లతో చేపట్టే సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శంకర్‌పల్లి మున్సిపల్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి ప్రగతిపథంలో నిలుపుతానని హామీ ఇచ్చారు. రోడ్లు, మురుగుకాలువల నిర్మాణం శంకర్‌పల్లిలో పెద్ద ఎత్తున ఇప్పటికే చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చుతున్నదని ఆయన అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే యాదయ్య పిలుపునిచ్చారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా వివరించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, డీఈ యాదయ్య, ఏఈ సాయి కిరణ్, కౌన్సిలర్లు శ్రీనాథ్‌గౌడ్, అశోక్, గోపాల్, చంద్రమౌళి, కో-ఆప్షన్ సభ్యుడు షైమూద్, నాయకులు గోపాల్‌రెడ్డి, ప్రకాష్, గోపాల్, అశోక్‌కుమార్, రవిందర్‌రెడ్డి, చంద్రమోహన్, రఘునందర్‌రెడ్డి. మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రొటోకాల్'పై చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి ఆగ్రహం

- రాజీనామాకు సిద్ధమైన సూపరింటెండెంట్!
- మెప్మా సిబ్బంది, కమిషనర్‌పై మండిపాటు



మహేందర్‌రెడ్డి పేరులేని మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన ఆహ్వాన పత్రిక



తర్వాత పేరును చేరుస్తూ ప్రింట్‌చేసిన పత్రిక

తాండూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా తాండూరు అధికారులు ప్రొటోకాల్ పాటించడం లేదని.. ఈ విషయంలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం తాండూరు పట్టణంలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఏర్పాటుచేసిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి తనకు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యఅతిథిగా స్పీకర్ ప్రసాద్ హాజరై ప్రారంభించాల్సిన మాతాశిశు ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటుచేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవానికి అందరికంటే ముందుగా మహేందర్‌రెడ్డి చేరుకున్నారు. అక్కడ కార్యక్రమానికి సంబంధం లేకున్నా ఆవరణలో ఏర్పాటు చేస్తున్నందుకు అక్కడకు వచ్చిన జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ రవిశంకర్‌ను మహేందర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్కడే ఉన్న సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌పై మండిపడ్డారు. అలాగే మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి, మెప్మా టీఎంసీ రాజేంద్రప్రసాద్‌పై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇష్టానుసారంగా చేస్తే కుదరదని హెచ్చరించారు. కార్యక్రమానికి మెప్మా టీఎంసీ, పీడీ, మున్సిపల్ కమిషనర్‌లు ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానించాల్సి ఉండగా.. దాన్ని పాటించలేదు. పద్ధతి మార్చుకోవాలని కమిషనర్‌ను హెచ్చరించారు. సంబంధం లేకున్నా తమపై అనవసరంగా మహేందర్‌రెడ్డి మండిపడటంపై నొచ్చుకున్న సూపరింటెండెంట్ రవికుమార్ తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ విషయంలో ఆయనను సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్చాఫ్ వచ్చింది. అయితే, పూర్తి వివరాలు తెలుసుకోకుండా మహేందర్‌రెడ్డి వైద్యాధికారులపై మండిపడటాన్ని కొందరు తప్పు పడుతూ విమర్శిస్తున్నారు. అసలు మెప్మా అధికారులు మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తమకు ఎలాంటి సంబంధం లేదని కేవలం షాప్ కేటాయించే వరకు మాత్రమే తమ బాధ్యత అని డీసీహెచ్‌వో ప్రదీప్‌కుమార్ ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

రేపు జీఈఎస్టీ ప్రవేశ పరీక్ష

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఎన్టీఆర్ విద్యాసంస్థల డీన్ రామారావు



మాట్లాడుతున్న రామారావు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ విద్యాసంస్థల ఉపకార వేతనం కోసం డిసెంబరు 8(ఆదివారం) బాలికా విద్యా స్కాలర్‌షిప్ టెస్ట్(జీఈఎస్టీ)ను మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్ గ్రామ సమీపంలోని గండిపేట చెరువు ఒడ్డునగల ఎన్టీఆర్ విద్యాసంస్థల్లో నిర్వహించనున్నట్లు డీన్ ఎస్వీ రామారావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రేపు ఎన్టీఆర్ విద్యాసంస్థల ఆవరణలో బాలికా విద్యా స్కాలర్‌షిప్ టెస్ట్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలను అందిస్తున్నట్లు ట్రస్ట్ చైర్మన్ నారా భువనేశ్వరి ప్రకటించినట్లు తెలిపారు. ఇందుకు గాను అర్హులను ఎంపిక చేసేందుకు పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్షకు 10వ తరగతి చదివే బాలికలు అర్హులని వివరించారు. మొదటి పది ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.5వేలు, తర్వాతి 15 ర్యాంకులు సాధించిన వారికి నెలకు రూ.3వేల చొప్పున ఇంటర్ పూర్తయ్యే వరకు ఉపకార వేతనం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 76600-02627 నెంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కాగా, ఒకరోజు ముందు అనగా నేడు కూడా పేర్లు నమోదు చేసుకున్న వారిని పరీక్ష రాసేందుకు అనుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. జేఈఈ మెయిన్, నీట్, సివిల్స్ ఇంటిగ్రేటెడ్ కోచింగ్‌తో పాటు ఇంటర్, డిగ్రీ కోర్సులకు సిద్ధం కావాలనుకునే బాలికలకు నాణ్యమైన విద్య, ఆర్థికసాయం అందించడానికి, ప్రతిభావంతులను గుర్తించేందుకు ఎన్టీఆర్ విద్యాసంస్థలు ప్రతీయేటా ఈ పరీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అనుమతుల్లేకుండా క్లినిక్ నిర్వహణ..

అర్హత లేకున్నా వైద్యం

- పరిగిలో క్లినిక్ సీజ్.. మరో దానికి నోటీసులు
- అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండా వైద్యం చేయొద్దు
- డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్



గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డీడీఎంహెచ్‌వో జీవరాజ్

పరిగి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేని పరిగిలోని గ్లోబల్ క్లినిక్‌ను సీజ్ చేసినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌వో జీవరాజ్ తెలిపారు. శుక్రవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో, డిప్యూటీ డెమో శ్రీనివాసుల టీం తనిఖీ చేశారు. గ్లోబల్ క్లినిక్‌లో ఎలాంటి విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ లేకుండా ఎంబీబీఎస్ డాక్టర్‌గా చలామణి అవుతున్న రాజు అనే వ్యక్తి క్లినిక్ నిర్వహించడాన్ని గుర్తించారు. విద్యార్హతలకు సంబంధించి సర్టిఫికెట్లు లేనందున క్లినిక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. అలాగే లోటస్ క్లినిక్‌కు రిజిస్ట్రేషన్ లేనందుకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. విద్యార్హతలు, రిజిస్ట్రేషన్ లేకుండా క్లినిక్‌లు నిర్వహిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అర్హతలు ఉన్న వారు జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో అనుమతి పొందిన తర్వాతనే క్లినిక్‌లు నిర్వహించాలని సూచించారు. లేనిచో సీజ్ చేస్తామని స్పష్టం చేశారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం



పల్లకీ సేవలో మాజీ ఎమ్మెల్యే బక్కని, తదితరులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్ర జ్యోతి): షాద్‌నగర్ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రవణ నక్షత్రాన్ని పురష్కరించుకొని స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆధ్వర్యంలో కల్యాణం నిర్వహించి, ఆలయం చుట్టూ పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రవంతి, పరిగి వెంకట సాయిశ్వర్‌రెడ్డి, ఒగ్గు కిషోర్, వేముల బాల్‌రాజ్, కానుగు రాంభూపాల్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వానరానికి అంత్యక్రియలు



దోమ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోత్కూర్ గ్రామంలో అస్వస్థతకు గురై మృతిచెందిన వానరానికి శుక్రవారం ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, గ్రామస్థులు సాంప్రదాయ బద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. డప్పులతో ర్యాలీగా వెళుతూ గ్రామ శివారులో వానరానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఇతర వానరాలు కూడా గుంపుగా అక్కడికి చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవరాశులను చూసి మనుషులు చాలా నేర్చుకోవాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు శివ, వినోద్‌కుమార్, చంద్రశేఖర్‌గౌడ్, గొల్ల రాములు, గ్రామ పంచాయతీ సిబ్బంది హన్మంతు, బాబు, ఎల్లమ్మ పాల్గొన్నారు.

రుణమాఫీ.. ఇంకెప్పుడు?

- ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘంలో 1230 మందికి వర్తించని రుణమాఫీ
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు



ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూ.2లక్షల రుణమాఫీ ఘట్‌కేసర్ మండలంలోని రైతులకు ఇప్పటివరకూ వర్తించలేదు. ఆగస్టు 15లోపు రైతులందరికీ రూ.2లక్షల వరకు సంపూర్ణంగా రుణమాఫీ చేస్తానని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా ఘట్‌కేసర్ రైతు సేవా సహకార సంఘం రైతులకు మాత్రం ఒక్క పైసా కూడా మాఫీ కాలేదు. ఇటీవల సీఎం మహబూబ్‌నగర్‌లో నాలుగో విడత కింద రుణమాఫీ చేసినా ఘట్‌కేసర్ పరిధిలోని రైతులకు మాత్రం మాఫీ అయినట్లు ఎలాంటి సమాచారం రాలేదు. ఘట్‌కేసర్ మండలంలో ప్రధానంగా రైతు సేవా సహకార సంఘం నుంచే రైతులు పంటరుణాలు తీసుకుంటారు. ఇందులో 1230 మందికి రూ.9కోట్ల మేర రుణం తీసుకున్నారు. ప్రభుత్వం మూడు విడతల్లో రుణమాఫీ చేస్తానని ప్రకటించినా తమకు కాలేదని రైతులు వాపోతున్నారు. సహకారం సంఘం చుట్టూ రైతులు కాళ్లరిగేలా తిరుగతున్నారు. కాగా, వివిధ వాణిజ్య బ్యాంకుల్లో రుణం తీసుకున్న 72 మందికిగాను రూ.కోటీ 25లక్షల రుణమాఫీ అయ్యింది. సహకార సంఘంలో మాత్రం ఆడిట్ జరుగుతోంది.. త్వరలో మాఫీ అవుతుందని అధికారులు మొదటి నుంచీ రైతులకు చెబుతూ వచ్చారు. ఇటీవల సీఎం మహబూబ్‌నగర్‌లో నాలుగో విడత కింద మిగతా రైతులందరికీ రుణమాఫీ చేస్తున్నామని ప్రకటించినా తమకు వర్తించలేదని ఘట్‌కేసర్ మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఆడిట్ పూర్తికాగానే రుణమాఫీ



బ్యాంకులతో పాటు సహకార సంఘం నుంచి పంపించిన డాటా ఆడిట్ జరుగుతోంది. అది పూర్తికాగానే సహకార సంఘంలో రుణం తీసుకున్న రైతులకు మాఫీ అవుతుంది. కమర్షియల్ బ్యాంక్‌లో రుణం తీసుకున్న 72 మంది రైతులకు రూ.కోటీ 25లక్షల రుణ మాఫీ అయ్యింది.

- ఎంఏ బాసిత్, మండల వ్యవసాయాధికారి

పెట్టుబడికి కష్టంగా మారింది



గత ప్రభుత్వం పెట్టుబడి సాయం కింద ఎకరాకు రూ.5 వేలు ఇచ్చేది. ఈ ప్రభుత్వం రుణమాఫీ చేస్తే మళ్లీ పంట రుణం తీసుకోవచ్చని అనుకున్నా. అధికారులు రుణమాఫీ చేస్తే బాగుంటుంది. పంటల సాగుకయ్యే పెట్టుబడికి అప్పు చేయాల్సి వస్తుంది. ఈ విషయంలో అధికారులు చొరవ తీసుకోవాలని కోరుతున్నా.

- ఉప్పు లింగేశ్వర్‌రావు, ఎదులాబాద్

రైతులను ఇబ్బందికి గురిచేయొద్దు



రైతులందరికీ రుణమాఫీ చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా ఘట్‌కేసర్ మండల రైతులకు మాత్రం మాఫీ వర్తించలేదు. వానకాలం, యాసంగి పంటలకు రైతులు అప్పులు చేయాల్సిన పరిస్థితి దాపురించింది. ఆడిట్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదు. మా మండల రైతులకు రుణమాఫీ చేసి రైతు పండుగలు నిర్వహించాలి.

- పన్నాల కొండల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్

టీడీపీతోనే బలహీన వర్గాలకు గుర్తింపు



ఆమనగల్లులో సభ్యత్వాలు ఇస్తున్న యాదిలాల్

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు రాజకీయగుర్తింపు ఇచ్చిన ఘనత టీడీపీ కే దక్కిందని టీడీపీ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అడ్‌హక్ కమిటీ సభ్యులు, సీనియర్ న్యాయ వాది అండేకార్ యాదిలాల్ అన్నారు. తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం మొదలైందని ఆయన అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు గ్రామాలలో శుక్రవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యాదిలాల్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సభ్యత్వాలు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రాజకీయాలలో టీడీపీ క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రమాదవశాత్తు మరణించిన కార్యకర్తలకు గతంలో ఇచ్చే రూ.2 లక్షల ప్రమాద బీమాను రూ.5 లక్షలకు పెంచడం జరిగిందని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో టీడీపీ సభ్యత్వ నమోదుకు వేగంగా చేపట్టాలని యాదిలాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో వజ్ర లింగం, తిమ్మయ్య, సింహారెడ్డి, బిక్యానాయక్, కాలే శివ, శ్రీనివాస్, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బీసీ మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలి



బండి సంజయ్‌కి వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్‌గౌడ్

తాండూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ బీసీ యువజన సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఈడిగ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులతో కలిసి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని కలిసి విన్నవించారు. ఈమేరకు శుక్రవారం బండి సంజయ్‌ని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. 50 శాతానికి పైగా జనాభా ఉన్న బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ అవసరమని, ఈ విషయం కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ది గ్యారంటీల గారడీ : బీజేపీ



పోస్టర్‌ను విడుదల చేస్తున్న బీజేపీ నాయకులు

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధికారమిస్తే ప్రజల బతుకులు మారుస్తామని ఎన్నికల ముందు ఆరు అబద్ధాలు ఆడిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి రాగానే 66 మోసాలకు పాల్పడుతున్నదని బీజేపీ నాయకులు విమర్శించారు. షాద్‌నగర్‌లోని ఏబీ కాంప్లెక్స్‌లో శుక్రవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించే బీజేపీ బహిరంగ సభకు సంబంధించిన పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం విలేకరుల సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు మాట్లాడారు. ఓటు బ్యాంకు రాజకీయాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రైతులను, మహిళలను, నిరుద్యోగులను, యువతను, విద్యార్థులను మోసగిస్తూ పోతున్నదని విమర్శించారు. రాష్ట్రంలో పాలకులు మారారే తప్ప.. ప్రజల బతుకులు మారలేదన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయలేదని, రైతు బంధు, నిరుద్యోగ భృతి, మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ వంటి పథకాలను ఇవ్వకుండానే సంబరాలు చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టి ప్రజల్లో చైతన్యం తేవడానికి శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్నారని, పార్టీ క్యాడర్‌తో పాటు ప్రజలు అధిక సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు. నాయకులు చెంది తిరుపతిరెడ్డి, దేపల్లి అశోక్‌గౌడ్, కక్కునూరి వెంకటేష్ గుప్తా, మోటే శ్రీనివాస్, మఠం రుషీకేష్, హరిభూషణ్ పటేల్, ఎంకనోళ్ళ వెంకటేష్, పసుల ప్రశాంత్ తదితరులున్నారు.

కడ్తాల్ : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గారడీలతో ప్రజలను మోసగించిందని ఎస్టీ మోర్చా మండలాధ్యక్షుడు నేనావత్ ప్రేమ్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఏడాదిలో చేసిన వైఫల్యాలను ప్రజలకు తెలిసేలా శనివారం ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగ సభకు సంబంధించి సన్నాహక సమావేశం కడ్తాల మండల కేంద్రంలో నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ ముసుగులో బీఆర్‌ఎస్‌కు ఊడిగం

- రాంబల్‌నాయక్ తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనునాయక్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడి హోదాను అడ్డం పెట్టుకున్న రాంబల్‌నాయక్ బీఆర్‌ఎస్‌కు ఊడిగం చేసే పనిని మానుకోకపోతే లంబాడీలే తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ హెచ్చరించారు. షాద్‌నగర్ కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనునాయక్ మాట్లాడారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రశ్నించిన ప్రతీ ఒక్కరిపై అక్రమ కేసులు పెట్టి, జైలుకు పంపించినప్పుడు నోరు మెదపని రాంబల్‌నాయక్.. బీఆర్‌ఎస్ అధికారం కోల్పోగానే ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా అవతారం ఎత్తి కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు, పోరాటాలు అంటూ ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రౌడీషీట్ కేసు పెడితే నిన్ను.. నీ ఆస్తులను రక్షించింది ఎవరో తెలియదా? అని ప్రశ్నించారు. అసత్య ఆరోపణలతో గిరిజనులను మభ్యపెడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తూలనాడితే సహించబోమని హెచ్చరించారు. ఉంటే పార్టీలకు సంబంధం లేకుండా గిరిజన నాయకుడిగా ఉండాలని.. అలా బతకలేకపోతే బీఆర్‌ఎస్ నాయకుడిగా కొనసాగాలే తప్ప.. కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ఆరోపణలు చేస్తే గిరిజనులే బుద్ధి చెబుతారని శ్రీనునాయక్ హెచ్చరించారు. నెహ్రూనాయక్, రూప్లానాయక్, రవీందర్‌నాయక్, బాలునాయక్, ప్రేమ్‌నాయక్, నారాయణనాయక్, తులసీ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం : ఎమ్మెల్యే కసిరెడ్డి



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

తలకొండపల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కోటి మంది మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యమని, వారిని కోటీశ్వరులను చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా రేవంత్‌రెడ్డి పథకాలు రూపొందించి అమలు చేస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలో శుక్రవారం మహిళా సంఘాల సభ్యులకు రుణాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఆమనగల్లు మార్కెట్ చైర్‌పర్సన్ గీతా నర్సింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, ఏపీఎం శ్రీదేవి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మల్లమ్మ, బ్యాంకు అధికారులతో కలిసి 70 మంది మహిళా సంఘాలు రూ.9.30 కోట్లు రుణాలు పంపిణీ చేశారు. అనంతరం కసిరెడ్డి మాట్లాడుతూ మహిళా సంఘాలకు శాశ్వత ప్రాతిపదికన నిరంతరం ఆదాయం సమకూరేలా రాష్ట్రం ప్రభుత్వం పథకాలు రూపొందించి అమలు చేస్తుందని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గానికి మొదటి విడత 3500 ఇళ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఏఎంసీ డైరెక్టర్లు అంజయ్య, అజీం, కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మహిళా సమాఖ్య కార్యదర్శి లావణ్య, కోశాధికారి శిరీష, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, అర్హులైన పేదలకు భూమి, ఇళ్లు అనే ఐదు డిమాండ్లతో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శుక్రవారంతో 5వ రోజుకు చేరుకున్నాయి. జిల్లా కన్వీనర్ గొట్టే సురేష్ మాట్లాడుతూ.. ఐదు డిమాండ్లను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు శివకుమార్, పరశురాం, హరినాథ్, శ్రీధర్, మల్లేష్, రాములు, శ్రీనివాస్, బాబు, విజయ్‌బాబు, రమేష్, ప్రవీణ్, అఖిల్, విక్రమ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాకే ఉద్యోగాలు భర్తీ చేయాలి



సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ చేపట్టిన తర్వాతనే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి మబ్బు సాయన్న మాదిగ, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జి జంగయ్య మాదిగ, జిల్లా ఉపాధ్యక్షుడు తుడుం కిరణ్ మాదిగలు అన్నారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. జిల్లా నాయకులు మల్లేపోగు మల్లేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు, మాదిగల ఉద్యమ బలోపేతం, కల్వకుర్తిలో నిర్వహించే మాదిగల ఆత్మీయ సమ్మేళనం విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా సాయన్న, జంగయ్య, కిరణ్‌లు మాట్లాడుతూ మాదిగల సంక్షేమం పట్ల కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలన్నారు. కల్వకుర్తిలో నిర్వహించే సమ్మేళనానికి మాదిగలు ఉప్పెనల తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా, మండల నాయకులు వీరస్వామి, మైసయ్య, వగ్గు మైసయ్య, కొప్పు యాదయ్య, జంగయ్య, బాల్‌రామ్, సింహాద్రి, సుదర్శన్, కిరణ్, శంకర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణ సంకటం

● రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్లతో తరచూ ప్రమాదాలు.. పట్టించుకోని అధికారులు


కేశవగూడలో ఇండ్ల మధ్య కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు

షాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రోడ్ల పక్కన, ఇండ్ల మధ్య, సాగు భూముల్లో రక్షణ లేకుండా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారాయి. వీటి బారిన పడి తరచూ పశువులు మరణిస్తున్నాయి. కొన్నిసార్లు మనుషులు కూడా విద్యుదాఘాతానికి గురవుతూ ప్రాణాలు కోల్పోవడమో లేదా గాయపడడమో జరుగుతోంది. వీటితో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. జనావాసాలు, రోడ్ల వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయలేదు. అలాగే తక్కువ ఎత్తులో ఉండి ప్రమాదాలు సంభవిస్తున్నాయి. షాబాద్, మండల పరిధి గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లను ఫెన్సింగ్ వేయకుండా వదిలేశారు. ఏళ్లుగా ఇలాగే ఉంటున్నా ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకోవడం లేదు.

పంట పొలాల వద్ద

గ్రామాల్లో పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదభరితంగా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ముళ్లపొదలు పెరిగినా వాటిని తొలగించేవారు లేరు. పొదలు, తీగలు ట్రాన్స్‌ఫార్మర్ల వైర్లకు, కేబుళ్లకు చుట్టుకొని తరచూ ట్రిప్ అవుతున్నాయి. ఫ్యూజ్ ఎగిరిపోతోంది. వాటిని హెల్పర్లు బాగు చేయడం లేదు.

నిర్లక్ష్యానికి పశువులు బలి

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యానికి పశువుల ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. పొలాలు, రోడ్ల వెంబడి తక్కువ ఎత్తులో ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడంతో మేతకు వెళ్లిన పశువులు కరెంట్ షాక్‌తో మృత్యువాత పడుతున్నాయి. ముఖ్యంగా వానకాలంలో ఎర్తింగ్ అయి పదుల సంఖ్యలో పశువులు చనిపోతున్నాయి. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతోంది. ఇటీవల మండలంలో బోడంపహాడ్‌లో మహిళా రైతు కారు సువర్ణ గ్రామ సమీపంలో ఆవును మేపుతుండగా కరెంట్ షాక్‌తో మృతి చెందింది. మన్‌మర్రికి చెందిన పొట్టిగారి నర్సింహులు తన పొలం వద్ద రెండు ఆవులను మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద షాక్ కొట్టి మృతిచెందాయి.



షాబాద్‌లో హైవే పక్కన తక్కువ ఎత్తులో.. కంచలేని ట్రాన్స్‌ఫార్మర్

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్ వైర్లతో రక్షణ ఏర్పాటు చేయాలి. ఫెన్సింగ్ లేక పశువులు, గొర్లు, మేకలు మేతకు వెళ్లి కరెంట్ షాక్‌తో చనిపోతున్నాయి. ఆవులు, బర్ల మృతితో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. రోడ్ల పక్కన తక్కువ ఎత్తులో, ఓపెన్‌వైరింగ్‌తో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ గానీ గోడ గానీ లేవు. గ్రామాల్లో ఒక్క ట్రాన్స్ ఫార్మర్‌కు కూడా రక్షణ లేకుండా వదిలేశారు. వాహనదారులు ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా ప్రమాదం ఖాయం. అధికారులు వాటికి ఫెన్సింగ్ వేయాలి.

- ఒగ్గు మల్లయ్య, రైతు, కేశవగూడ

సమస్యను అధికారులు దృష్టికి తీసుకుపోతా



కంచలేని ట్రాన్స్‌ఫార్మర్లకు ఫెన్సింగ్ వేయించేందుకు త్వరలోనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతా. కరెంట్ షాక్‌తో పశువులు మృతిచెందితే వాటిని పశువైద్యాధికారితో పంచనామా చేయించి నిబంధనల మేరకు ప్రభుత్వం నుంచి పరిహారమందేలా చూస్తాం.

- కోటేశ్వర్‌రావు, ట్రాన్స్‌కో ఏఈ, షాబాద్

అంబేడ్కర్ మార్గాన్ని అనుసరించాలి

● వర్ధంతి కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలు, నాయకులు


షాద్‌నగర్: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ చూపిన మార్గాన్ని పాలకులు అనుసరించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం షాద్‌నగర్ ప్రధాన కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ వ్యక్తుల్లో అంబేడ్కర్ ఒకరని, ఆయన రాసిన రాజ్యాంగానికి తూట్లుపొడిచేలా కొందరు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. సమాజంలో అసమానతల నిర్మూలనకు అంబేడ్కర్ ఎంతో కృషిచేశారని, ఆయన బాటలోనే ప్రభుత్వాలు నడుచుకోవాలని సూచించారు. అలాగే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. నిమ్న వర్గాలను అత్యున్నత పదవులు కట్టబెట్టిన ఘనత కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. సీపీఐ, బీఎస్పీ నేతలు జంగయ్య, శ్రీనివాస్, దళిత సంఘాల నాయకుల నేతృత్వంలో అంబేడ్కర్ నివాళులు అర్పించారు. ఎర్రోళ్ల రవి, జనార్ధన్, అర్జున్, కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రశాంత్, రమేష్, భూషణ్ పటేల్ పాల్గొన్నారు.

చేవెళ్ల: అంబేడ్కర్ భావితరాలకు ఆదర్శమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్లలో ఆయన విగ్రహాలకు నివాళి అర్పించారు. అంబేడ్కర్ భావితరాల మార్గదర్శి అన్నారు. బడుగుల అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు. కుల వివక్ష నిర్మూలనకు ఆద్యుడు అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో పలువురు మండల నాయకులు ఉన్నారు.

షాబాద్: భారతరత్న అంబేడ్కర్ అడుగు జాడల్లో నడుద్దామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. నాగర్‌గూడ, తాళ్లపల్లి, షాబాద్, హైతాబాద్, ఇతర గ్రామాల్లో నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళి అర్పించారు. మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆదర్శ వ్యక్తి అంబేడ్కర్ అన్నారు. కుల వివక్ష నిర్మూలనకు ఆయన కృషి మరువలేదని, జాతి నిర్మాణంలో ఆయన పాత్ర గొప్పదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, టీజేఎస్ చేవెళ్ల అసెంబ్లీ ఇన్‌చార్జి రామకృష్ణ, కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రయ్య, నాయకులు కుమ్మరి చెన్నయ్య, అశోక్, రాజేందర్‌గౌడ్, వెంకట్‌యాదవ్, టి.రవీందర్, రాపోల్ నర్సింహులు, రాహుల్‌గుప్తా, అన్వర్, గౌరీశ్వర్, ఎగ్బాల్ పాల్గొన్నారు.

శంకర్‌పల్లి: అంబేడ్కర్ దేశానికిచేసిన సేవలు మరువలేనివని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. శంకర్‌పల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు. భారత ఆర్థిక వ్యవస్థకు పునాదులు వేయడంలో అంబేడ్కర్ సేవలు మరువలేనివన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిప్రవీన్‌కుమార్, కమిషనర్ శ్రీనివాస్, వైస్‌చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు చంద్రమౌళి, గోపాల్, శ్రీనాథ్‌గౌడ్, అశోక్, నాయకులు మహమూద్, వెంకటయ్య, గోవర్దన్‌రెడ్డి. గోపాల్‌రెడ్డి, ప్రకాశ్, రాంచందర్, అశోక్‌కుమార్, గోపాల్, చంద్రమోహన్, రఘునందన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం చౌరస్తా వద్ద అంబేడ్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నివాళులర్పించారు. అంబేడ్కర్ సమసమాజ స్థాపనకు పాటుపడిన గొప్ప వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో నాయకుల ఆకుల యదగిరి, బుగ్గరాములు, భాస్కర్‌రెడ్డి, రమేష్‌గౌడ్, రమేష్, ఎ.వెంకట్‌రెడ్డి, బాషా, జె.రాజు పాల్గొన్నారు.

చౌదరిగూడ: అంబేడ్కర్ వర్ధంతిని కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల్లో నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లేడ్ చౌదరిగూడ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, నాయకులు శివకుమార్, భాస్కర్, రాములు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు హఫీజ్, బాబురావు, వెంకటేష్, కొండి యాదయ్య, అక్రం పాల్గొన్నారు.

కేశంపేట: అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని బీఆర్ఎస్ నాయకుడు ఎన్.నవీన్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. అల్వాలలో బీజేపీ మండలాధ్యక్షుడు రాఘురాములుగౌడ్ విగ్రహానికి పూలమాల వేశారు.

నందిగామ: నందిగామ, వివిధ గ్రామాల్లో నాయకులు, ప్రజాసంఘాలు అంబేడ్కర్ విగ్రహాలకు, చిత్రపటాలకు నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో నాయకులు దార లింగం, ప్రభయ్య, సి.నర్సింలు, స్వామి, సురేష్, నర్సింహ, అశోక్, శ్రీకాంత్, సుమన్, క్రిష్ణ, రవి, రఘు, పూర్ణం శ్రీకాంత్ ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

కొత్తూర్: మున్సిపాలిటీ, వివిధ గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ వైస్‌చైర్మన్ డోలి రవీందర్, కౌన్సిలర్లు మాదారం నర్సింహగౌడ్, సోమ్లునాయక్, కోస్గి శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు కె.శ్రీనివాస్, బి.దేవేందర్‌యాదవ్, జె.శ్రీను, రవినాయక్, కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్‌గౌడ్, చిల్కమర్రి నర్సింహ, నవీన్‌చారి, ఇందూరి శ్రీనివాస్, కర్రోల్ల సురేందర్, రాజశేఖర్‌రెడ్డి, గోవింద్ పాల్గొన్నారు.

కందుకూరు: మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు గాదె కుమార్ ఆధ్వర్యంలో విగ్రహానికి నివాళ్లు అర్పించారు. ఎమ్మార్పీఎస్ నాయకుడు కంద నర్సింహ, మాజీ జడ్పీటీసీ జె.పెద్దరామయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. డీఎస్పీ మండల కన్వీనర్ ఆంజనేయులు, జిల్లా కన్వీనర్ అమరేందర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. గుమ్మడవెల్లిలో మాజీ సర్పంచ్‌లు గౌర ప్రభాకర్, మస్కు బాబు, యువకులు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు.


కందుకూరులో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పిస్తున్న నాయకులు

తలకొండపల్లి: నవ సమాజ నిర్మాణానికి అందరూ కృషిచేయాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. అంబేడ్కర్ స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. తలకొండపల్లిలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని నాయకులతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ్మా, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు అంజయ్య,అజీం, నాయకులు కాసు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీశైలం, డి.ప్రభాకర్‌రెడ్డి, డేవిడ్, మోహన్ రెడ్డి, రఘురాములు, శ్రీశైలం, దశరథం, రవీందర్‌యాదవ్, కృష్ణ, ఆరిఫ్, రమేశ్ పాల్గొన్నారు. వెల్జాలలో అంబేడ్కర్ వర్ధంతిలో జిల్లా సీనియర్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి నివాళ్లు అర్పించారు.


తలకొండపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి, పాల్గొన్న నాయకులు

కడ్తాల్: కడ్తాలలో కాంగ్రెస్, బీఆర్ఎస్, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, జె.దశరథ్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్, వేణుగోపాల్, హన్మనాయక్, చేగూరి వెంకటేశ్, లక్ష్మయ్య జహంగీర్‌బాబ, అశోక్, రాజేశ్, లక్‌పతినాయక్, బిక్షపతి, హీరాసింగ్, భానుకిరణ్, శ్రీకాంత్, రాఘవేందర్, దాసు, ఎం.నర్సింహ, కె.రామకృష్ణ, రాంచందర్, సేవ్యనాయక్ పాల్గొన్నారు.

ఆమనగల్లు: ఆమనగల్లులోని మండల పరిషత్ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వర్ధంతిని నిర్వహించారు. అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వొగ్గు మహేశ్ ఆధ్వర్యంలో వివిధ పార్టీల, సంఘాల నాయకులు విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవేందర్, రమేశ్, అఫీజ్, సుభాశ్, మల్లేశ్, కృష్ణ, మైసయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

యాచారం: దేశంలో బడుగుల ఉద్ధరణకు అంబేడ్కర్ చేసిన సేవలు వెలకట్టలేనివని కొత్తపల్లి మాజీ ఎంపీటీసీ కె.జగన్ అన్నారు. కొత్తపల్లిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లర్పించారు. గున్గల్‌లో మాజీ ఎంపీటీసీ కె. యాదయ్య, మాల్, ధర్మన్నగూడల్లో అంబేడ్కర్‌కు నివాళ్లర్పించారు.

శంషాబాద్ రూరల్: డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని సంఘం జిల్లా కార్యదర్శి పెద్దేటి జ్యోతి అన్నారు. జూకల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీచర్లు సవితారాణి, గీత, అంబేడ్కర్ సంఘం నాయకులు కత్తుల సంపత్, కోడూరి శ్రీకాంత్, పవన్ తదితరులు పాల్గొన్నారు.


శంకర్‌పల్లి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళ్లర్పించిన ఎమ్మెల్యే యాదయ్య

క్యాంప్ కార్యాలయం గేట్లు మూసివేత

● పోలీస్ పహారాతో బారికేడ్ల ఏర్పాటు

షాద్‌నగర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):వెలమలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ క్యాంప్ కార్యాలయ ప్రధాన గేట్లను శుక్రవారం రాత్రి పోలీసులు మూసివేశారు. ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా అర్ధరాత్రి నుంచి క్యాంప్ కార్యాలయం సమీపంలో బారికేడ్లు వేసి పహారాను ఏర్పాటు చేశారు. క్యాంప్ కార్యాలయంలోనూ పోలీసులను మోహరించారు. అలాగే పెట్రోలింగ్ వాహనంతో పట్టణమంతా కలియదిరుగుతున్నారు.


పోలీసు పహరాలో క్యాంప్ కార్యాలయం

కక్ష సాధిస్తున్న కాంగ్రెస్

కడ్తాల్/యాచారం/శంషాబాద్ రూరల్/ఇబ్రహీంపట్నం/కొత్తూర్/కేశంపేట/చేవెళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):అధికారాన్ని అడ్డంపెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రశ్నించే వారిని, ప్రతిపక్ష పార్టీల నేతలపై కక్షసాధిస్తోందని బీఆర్ఎస్ నాయకులన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్ వద్ద అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమానికి హాజరు కావాలని పార్టీ శ్రేణులకు మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో నాయకులు నగరానికి తరలకుండా పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు, హౌస్ అరెస్టు చేశారు. నాయకులను పీఎస్‌లకు తరలించారు. కడ్తాల్‌లో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్, ఇతర నాయకులను పోలీసులు అరెస్ట్ చేశారు. మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి మరో 20మంది నేతలను అరెస్ట్ చేసి సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో స్టేషన్‌కు తరలించారు. పోలీసులు అరెస్ట్ అయిన వారిలో తులసీరామ్ నాయక్, గోపాల్, కడారి రామకృష్ణ, సేవ్యనాయక్, నర్సింహ, పాండు, అంజి, కృష్ణ, శ్రీను, రమేశ్, మహేశ్, మల్లేశ్, సురేశ్, నాగార్జున, రాజు, బీమన్, శ్రీకాంత్, బిక్య ఉన్నారు. యాచారం, హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు 21మంది బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్టు చేశారు. వారిలో ఖాజుద్దీన్, వెంకటేష్, జాన్, యాదయ్య ఉన్నారు. శంషాబాద్ మండల నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఎంపీపీ దిద్యాల జయమ్మ, శ్రీనివాస్‌లను హౌస్ అరెస్టు చేశారు. ఇబ్రహీంపట్నంలో పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో యువజన విభాగ నియోజకవర్గ అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు నిట్టు జగదీశ్వర్, కరుణాకర్, రాజ్‌తారక్, జలందర్ ఉన్నారు. కొత్తూర్ నాయకులను పోలీసులు స్టేషన్‌కు తరలించి మధ్యాహ్నం విడుదల చేశారు. నాయకులు శ్రీనివాస్, బి.దేవేందర్‌యాదవ్, రవీందర్, కృష్ణ, నర్సింహగౌడ్, కె.శ్రీను, సోమ్లు, జె.శ్రీను, బాల్‌రాజ్ ఉన్నారు. కేశంపేటలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, నవీన్‌కుమార్, వెంకట్‌రెడ్డి, జమాల్‌ఖాన్, శ్రీనివాస్, మల్లేష్, సాజిద్, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేష్‌లను అరెస్ట్ చేశారు. చేవెళ్లలో మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, రాంప్రసాద్, ఎల్లన్న, అబ్దుల్ ఘనీ, వెంకటేష్, నర్సింహులు తదితరులను అరెస్టు చేశారు.


కడ్తాల్ మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్‌ను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న సీఐ వరప్రసాద్

సంక్షిప్తంగా

కడ్తాల్: మండల పరిధి బోయిన్‌గుట్ట తండాలో శుక్రవారం పశువులకు సంతానోత్పత్తి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్య అధికారి భానునాయక్ ఆధ్వర్యంలో పశువులకు గర్భధారణ పరీక్షలు, సాధారణ పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. పాడి పశువుల పోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు.

కేశంపేట: పేదింటి ఆడబిడ్డల పెళ్లికి మాజీ సర్పంచ్ అండగా నిలిచి పుస్తె, మట్టెలను అందించారు. పాపిరెడ్డిగూడకు చెందిన దివంగత యాదయ్య-మంజుల దంపతుల కూతరు శైలజ వివాహం శుక్రవారం నిర్వహించారు. ఈ పెళ్లికి మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణువర్ధన్‌రెడ్డి, తల్లి విజయలక్ష్మి పెళ్లి కూతరు బంధువులకు పుస్తె, మట్టెలు అందించారు. అలాగే గురువారం నిర్వహించిన స్వర్ణలత-నరసింహ దంపతుల కూతురు పూజిత పెళ్లికీ పుస్తెమట్టెలు అందజేశారు.

తలకొండపల్లి: సీఎం కప్ క్రీడోత్సవాలు నేటి(7) నుంచి నిర్వహిస్తామని ఎంపీడీవో శ్రీకాంత్, ఎంఈవో చంప్లానాయక్ తెలిపారు. క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తలకొండపల్లిలోని ఉన్నత పాఠశాలలో రెండు రోజులు నిర్వహించే క్రీడలకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఖోఖో, కబడ్డీ, సీనియర్, జూనియర్ విభాగాల్లో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తామని శ్రీకాంత్, ఎంఈవో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు పాల్గొనాలని కోరారు.

కడ్తాల్: మాల మహానాడు సింహగర్జనలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ కడ్తాల మండల ఇన్‌చార్జి రమేశ్ అన్నారు. మంత్రి పదవి కోసమే ఎమ్మెల్యే వివేక్ మాల మాదిగల మధ్య చిచ్చుపెట్టారని అన్నారు. మందకృష్ణపై వ్యాఖ్యలను నిరసిస్తూ కడ్తాలలో నిరసన చేపట్టారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు యాదయ్య, రామకృష్ణ మాదిగ, గిరి యాదిగ, రమేశ్ మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.

షాబాద్: సాయిరెడ్డిగూడలో మల్లికార్జున స్వామి ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఆలయ కమిటీ మెంబర్ శేఖర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ యువనాయకుడు దండు రాహుల్‌గుప్తా రూ.21వేల విరాళం ఇచ్చారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. దాతల సహకారంతో ఆలయాన్ని సుందరంగా నిర్మిస్తున్నామని, త్వరలోనే నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. కమిటీ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

షాబాద్: దివ్యాంగులు మనోధైర్యంతో ముందుకు సాగాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని తాళ్లపల్లి పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులమని బాధపడకుండా మనోధైర్యంతో, కష్టపడి చదివి ఉన్నతశిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, అంజయ్య, కృష్ణ, గోవర్దన్ ఉన్నారు.

మాడ్గుల: సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఈ నెల 10వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని సిబ్బంది శుక్రవారం ఎంఈవో సర్దార్, ఎంపీడీవో, ఎంపీడివో పద్మావతిలకు వినతి పత్రం ఇచ్చారు. ఎమ్మార్సీలో ఎంఐఎస్ ఆపరేటర్లు, సీఆర్పీలు, కస్తూర్బా పాఠశాలల్లో స్పెషల్ ఆఫీసర్, డేటా ఎంట్రీ ఆపరేటర్, హెల్పర్లుగా ఇలా వివిధ హోదాల్లో విద్యార్థులకు సేవలందిస్తున్నామన్నారు. తక్కువ వేతనాలతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. తమను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని, లేదంటే ఈ నెల 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు నాగిళ్ల లక్ష్మయ్య, కంప్యూటర్ ఆపరేటర్ తిరుపతయ్య, మధు, కస్తూర్బా సీహెచ్ రేఖ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయాలని చేవెళ్ల డివిజన్ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఇన్‌చార్జి శంకర్ అన్నారు. ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవోలకు వినతిప్రతాలు అందజేశారు.

కందుకూరు: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సంఘం నాయకులు ఎఈవో నర్సింహ్మాకు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు విజయలక్ష్మి, వెంకటేష్ మాట్లాడారు. 15సంవత్సరాలుగా ఎమ్మార్సీలో, కాంప్లెక్స్ పాఠశాలల్లో, కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మంజుల, లావణ్య భవానీ, సురేష్, సత్తయ్య, జంగయ్య పాల్గొన్నారు.

ఆమనగల్లు: సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది ఎంపీడీవో మాధురికి వినతిపత్రం ఇచ్చారు. కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని కోరారు. కనీస వేతనం చెల్లించాలని, రూ.20లక్షల బీమా, ఉద్యోగ విరమణ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధరలకనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు.

యాచారం: 18ఏళ్లుగా సమగ్ర శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న 19,325మంది ఉద్యోగులను ఆదుకోవాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, తహసీల్దారు అయ్యప్ప, ఎంఈవో పాండురంగారెడ్డిలకు వినతిపత్రాలు అందజేశారు. రాధాకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

కడ్తాల్: పేదింటి ఆడపడుచు పెళ్లికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చేయూతనిచ్చింది. రావిచెడ్ పంచాయతీ పరిధి మద్దెలకుంట తండాకు చెందిన దేవిదాస్య దంతపతుల కుమార్తె శోభ వివాహనికి రాధాకృష్ణ ట్రస్ట్ ద్వారా రూ.21వేలు సాయం, పట్టు చీరను శుక్రవారం చైర్మన్ దశరథ్‌నాయక్ అందించారు. వధూవరులను ఆయన ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మాజీ ఉపసర్పంచ్ శారదపాండు రూ.11వేలు అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బొప్పిడి గోపాల్, లక్ష్మీకన్ననాయక్, సాయి, తిరుపతి, బాలకృష్ణ, కుమార్, మల్లేశ్, వినోద్ పాల్గొన్నారు.



క్రైం కార్నర్

ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఇద్దరు పిల్లలతో తల్లి అదృశ్యమైన సంఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండా చౌరస్తాకు చెందిన షాహెదా (32), కుమారుడు రఫత్(7), అసద్(4) ఈ నెల 5న ఇంట్లో నిద్రిస్తుండగా ఇంటి నుంచి ఇద్దరు పిల్లలతో ఎంటో వెళ్లింది. భర్త జహంగిర్‌ఖాన్ నిద్రలేచి చూసేసరికి భార్య, పిల్లలు కన్పించలేదు. దీంతో కంగారుపడ్డ భర్త.. బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. చివరికి జహంగిర్ ఫిర్యాదు మేరకు ఆర్జీఐఏ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పటేల్‌గూడ వాసి...


సురేష్

షాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. షాబాద్‌కు చెందిన పటేల్‌గూడ సురేష్(35) నెల క్రితం ఇంట్లో నుంచి ఎటో వెళ్లిపోయాడు. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. సురేష్ తండ్రి రాములు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మేడారం తండాకు చెందిన మహిళ ...


కవిత

యాచారం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):కడ్తాల్ మండలంలోని మేడారంతండాకు చెందిన జాటోత్ ధనమ్మ అనే మహిళ అదృశ్యమైంది. మంచాల మండలం దాత్‌పల్లితండాకు చెందిన ధనమ్మకు 13ఏళ్ల క్రితం బాలాజీతో వివాహమైంది. ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరు తరచూ గొడవ పడేవారు. దీంతో కవిత తల్లిగారిల్లు దాత్‌పల్లిలో ఉంటోంది. గత నెల 18న కవిత అత్తగారింటికి వెళ్తానని అనడంతో ఆమె సోదరుడు భాస్కర్ మాల్ బస్టాండ్ వద్ద దింపాడు. కవిత అత్తగారింటికి వెళ్ల లేదు. ఇటు తల్లిగారింటికీ రాలేదు. శుక్రవారం కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఎ.నర్సింహారావు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

శంకర్‌పల్లి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎల్వర్తిలో తాళంవేసి ఉన్న ఓ ఇంట్లో గురువారం అర్ధరాత్రి దొంగలుపడ్డారు. 25తులాల వెండి ఆభరణాలు, 4గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.30వేల నగదును ఎత్తుకెళ్లారు. శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్వర్తికి చెందిన తమ్మలి రామలక్ష్మయ్య కోడలు శివలీలకు ఆరోగ్యం బాగాలేక గురువారం ఇంటికి తాళంవేసి ఆసుపత్రికి శంకర్‌పల్లికి వచ్చారు. అనంతరం వారు అర్ధరాత్రి ఇంటికి వెళ్లేలోపు చోరీజరిగింది. బాధితుల ఫిర్యాదుతో శుక్రవారం క్లూస్, ఫింగర్ ప్రింట్స్ టీం, సీసీఎస్ అధికారులు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పది క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

యాచారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మొండిగౌరెల్లిలో శుక్రవారం రాత్రి అక్రమంగా తరలిస్తున్న పది క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పెట్రో మొబైల్ పోలీసుల తనిఖీలో టాటాను మోలో 23బ్యాగుల్లో రేషన్ బియ్యం ఉన్నట్లు గమనించారు.కడ్తాల్ మండలంలోని పల్లెచెల్కతండాకు చెందిన వి.మోతాలాల్. వి.మహిపాల్‌లను అదుపులోకి తీసుకొని బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు చెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నర్సింహారావు తెలిపారు.

పత్రాలు చూపి వాహనాలు తీసుకెళ్లాలి

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి):పలు కేసుల్లో సీజ్‌చేసిన వాహనాలను వాటి యజమానులు సర్టిఫికెట్లు చూపి తీసుకెళ్లాలని ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో 9 బైక్‌లున్నాయని, వాటి యజమానులు వాటిని తీసుకెళ్లాలన్నారు.

వంశీచంద్‌ను కలిసిన శ్రీకాంత్



ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):ఆమనగల్లు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన వస్పుల శ్రీకాంత్ శుక్రవారం ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వంశీని హైదరాబాద్‌లోని నివాసంలో కలిసి సత్కరించారు. అలాగే శ్రీకాంత్‌ను వంశీ సత్కరించి అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని కోరారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

కడ్తాల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పార్టీ శ్రేణులు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పోతుగంటి అశోక్ అన్నారు. కడ్తాలలో శుక్రవారం యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన క్యామ రాజేశ్, మండల అధ్యక్షుడిగా ఎన్నికైన బోసు రవి, నియోజకవర్గ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన షాబుద్దీన్, ఇమ్రాన్‌బాబలను అశోక్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు దాసు ఆధ్వర్యంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా కృషిచేయాలని కోరారు. నాయకులు భానుకిరణ్, శ్రీకాంత్, రమేశ్, మహేశ్ పాల్గొన్నారు.

'అధైర్య పడొద్దు అండగా ఉంటాం'

ఆమనగల్లు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అధైర్య పడొద్దు అండగా ఉంటామని కాంగ్రెస్ జిల్లా నాయకుడు మండ్లీ రాములు అన్నారు. నిరుపేదల, బాధిత కుటుంబాలను అన్ని విధాల ఆదుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఆమనగల్లు మండలం శంకర్ కొండ తండాకు చెందిన నేనావత్ పుల్యానాయక్ ఇటీవల అనారోగ్యంతో చనిపోయాడు. శుక్రవారం మృతుడి కుటుంబాన్ని రాములు పరామర్శించారు. రాములు వ్యక్తిగతంగా రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు పత్యానాయక్, రాజు, చంద్రునాయక్, తదితరులు ఉన్నారు.

వినోద్‌కు పీసీసీ చీఫ్ అభినందన



కడ్తాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన వినోద్‌నాయక్‌ను పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అభినందించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో వినోద్ పీసీసీ చీఫ్‌ను కలిశారు. వినోద్‌ను మహేశ్ సత్కరించి అభినందించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కావాలని తెలిపారు.

తెల్లబోయిన పత్తి రైతు

(5వ పేజీ తరువాయి)

రూ.1200, దావతులు తదితర ఖర్చులు రైతుకు తడిసి మోపెడవుతున్నాయి. ఈ ఏడాది కాటన్ కార్పొరేషన్ కనీస మద్దతు ధర రూ.500 పెంచింది. దీంతో పత్తి క్వింటాల్ ధర రూ.7521 ధర నిర్ణయించి సీసీఐ ద్వారా కొనుగోళ్ల ప్రారంభించారు.8శాతం తేమ ఉన్న పత్తికి ఈ మద్దతు ధర చెల్లిస్తామని నవంబరులో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రారంభించారు. నెల రోజులు గడవక ముందే మద్దతు ధరలో రూ.50 తగ్గించారు. ఉమ్మడి మండలంలో మొదటి దఫా పత్తి కోతలు కూడా పూర్తికాక ముందే కాటన్ కార్పొరేషన్ ధర తగ్గించడం ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఓ వైపు కూలీలు దొరకక పత్తి సేకరణ ఆలస్యమవుతుండగా, పెట్టుబడి ధరలు పెరిగి, ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాక అవస్థ పడుతుంటే గిట్టుబాటు ధర కూడా తగ్గిస్తే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిసెంబరు చివరి వరకు ధర తగ్గించకుండా పత్తి కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పొలంలోనే పత్తి

నేను 30 ఎకరాలను కౌలుకు తీసుకొని 15 ఎకరాల్లో పత్తి సాగు చేశా. సకాలంలో వర్షాలు కురవక సాగు ఆలస్యమైంది. పత్తి తీసేందుకు కూలీలు కూడా దొరకడం లేదు. ప్రభుత్వం మద్దతు ధర తగ్గిస్తే రైతులు తీవ్రంగా నష్టపోతారు. రైతుల పరస్థితిపై ఆలోచించాలి.

- దయ్యాల శ్రీశైలం, పత్తి రైతు, కొందుర్గు మండలం

అప్పే మిగిలింది

మూడు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి సాగు చేశా. సాగు కోసం ఎకరానికి 40వేలు ఖర్చు చేసినా ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదు.

- వడ్ల బుచ్చయ్య,రైతు, తుమ్మలపల్లి,జిల్లేడ్‌చౌదరిగూడ మండలం